ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 27.05.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల 1వ తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.
2. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్రమే వ్యయం భరిస్తున్నా, వడ్ల కొనుగోలుకు సమన్వయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.
3. కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు.
4. ప్రజా పాలన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. జూన్ 2 నుంచి 12 వరకు విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది.
5. రాష్ట్రంలో ఎబోలా కేసులు నమోదు కాలేదని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. అయినా అప్రమత్తంగా ఉండాలని, ఎవరికైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే ఐసొలేషన్ వార్డుకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------------------

**ముఖ్యమంత్రి సమీక్ష**

రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిన్న సచివాలయంలో సమీక్ష

నిర్వహించిన ముఖ్యమంత్రి ..పలు కీలక సూచనలు చేశారు. ఐఏఎస్ అధికారులకు నెల నెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా అలాగే జీతాలు అందాలని స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు అందేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. గ్రామ పంచాయితీ సిబ్బంది జీతాలు చెల్లించడానికి ప్రతీ నెలా 50 కోట్ల రూపాయల నిధులను ప్రత్యేకంగా మంజూరు చేస్తామని తెలిపారు.పెన్షన్ల పంపిణీ విధానంపైనా ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు ఇచ్చారు. పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న ప్రస్తుత విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని సూచించారు. అర్హులకు పెన్షన్లు అందేలా చూడాలని ఆదేశించారు. కొత్తగా అందించే పెన్షన్లలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**డెస్క్**

-----------------------------------

**బండి సంజయ్**

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం రెండో అంతస్తు నిర్మాణ పనులకు రాత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కార్మిక ఆరోగ్య సంక్షేమ భవన పునరుద్దరణ, షెడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ధాన్యం కొనుగోలుకు అయ్యే వ్యయమంతా కేంద్రమే భరిస్తోందన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిత్వం మాత్రమే వహిస్తుందని, అయినా ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమవుతోందని ఆరోపించారు.

**SOUND BYTE బండి సంజయ్**

ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేయాలని, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పీటీసీ కరీంనగర్**

--------------------------------

**ఉత్తమ్**

తెలంగాణా రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖామంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం...కేంద్ర ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. పెరిగిన ధాన్యం దిగుబడికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి బాసటగా నిలిచిందన్నారు. తమ ప్రభుత్వం సేకరించినంత ధాన్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ కొనుగోలు చేయలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని తెలిపారు. అయితే ఇవన్నీ పట్టించుకోకుండా రాష్ట్ర బీజేపీ నేతలు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలివెళ్తున్నారంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

**డెస్క్**

--------------------------------

**ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది.  జూన్ 2 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా  విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని, పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. నిన్న సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. గ్రామ సభ,

మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.

డెస్క్

-------------------------------

**ఎబోలా కేసుల్లేవ్**

రాష్ట్రంలో ఎబోలా కేసులు నమోదు కాలేదని, ఎబోలా లక్షణాలు ఉన్న వ్యక్తులను ఇప్పటివరకు గుర్తించలేదని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. ముందస్తు జాగ్రత్తలు, సన్నద్ధతపై హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిన్న మంత్రి సమీక్ష చేశారు. తెలిపారు. అయినా ముందు జాగ్రత్తగా 21 రోజుల హోమ్ ఐసోలేషన్‌లో ఉంచామని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వారిని వెంటనే గాంధీ హాస్పిటల్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించాలని సూచించారు. ఎబోలా విషయంలో రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్రంలోకి ఎబోలా ప్రవేశించకుండా ఎయిర్‌పోర్టులోనే ప్రయాణికులకు స్క్రీనింగ్, థర్మల్ స్కానింగ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజారోగ్య రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థ సిద్ధంగా ఉందని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

డెస్క్

-------------------------------

**SIR ప్రక్రియ**

రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి కీలక సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని స్పష్టం చేశారు. నిన్న హైదరాబాద్‌లోని BRKR భవన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి S.I.R. కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. SIR మ్యాపింగ్ ప్రక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని EROలకు సూచించారు. అలాగే BLOల పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అపార్ట్ మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి అందులో నివసిస్తున్నవారికి అవగాహన కల్పించాలని EROలకు సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన BLOకు బెస్ట్ BLO అవార్డు అందజేస్తామని సీఈవో సుదర్శన్ రెడ్డి ప్రకటించారు.

**డెస్క్**

----------------------------------

**తాగునీటి సరఫరాపై..**

హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరాపై ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిన్న ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నగరానికి 650 మిలియన్ గ్యాలన్ల నీరు అందుతోందని తెలిపారు. భవిష్యత్ అవసరాల కోసం 7 వేల కోట్ల రూపాయల ఖర్చుతో గోదావరి ఫేజ్-2, 3 ప్రాజెక్టులను తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. భవిష్యత్ లో కృష్ణా ఫేజ్ 4,5 ప్రాజెక్ట్ లు చేపడతామని తెలిపారు. నగరంలో 14 లక్షల 50 వేల ట్యాప్ కనెక్షన్లు ఉంటే..తాను నీటి సమస్యలనుఎప్పటికపుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. వేసవిలోనూ ట్యాంకర్ సప్లై బాగా జరుగుతుందని, 95 శాతం ట్యాంకర్లు బుకింగ్ అయిన 24 గంటల్లోనే డెలివరీ

అవుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంచినీటిని దుర్వినియోగం చేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

**డెస్క్**

-----------------------------------

**పంట అవశేషాలపై..**

పంట వ్యర్థాలదహనం అరికట్టేందుకు రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పంట వ్యర్థాలదహనాన్ని పూర్తిగా నివారించే దిశగా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలునిర్వహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..అధికారులను ఆదేశించారు.పంట వ్యర్థాలను కాలిస్తే భూసారం దెబ్బతింటుందని, ఆ తర్వాత పంట దిగుబడి, పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయని హెచ్చరించారు.
గాలి కాలుష్యం పెరిగి శ్వాసకోశ, కంటి, చర్మ సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. నిన్న నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. పంట అవశేషాలను కాల్చకుండా కలియదున్నే పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. భూమిని, పంట అవశేషాలను కలియదున్నితే భూసారం పెరగడంతో పాటు నేలలో తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఎరువుల వినియోగం తగ్గి పంట దిగుబడులు మెరుగుపడతాయని వెల్లడించారు.

**డెస్క్**

---------------------------------

**ధాన్యం కొనుగోలు**

తెలంగాణ ప్రభుత్వం ఈ సీజన్ లో ఇప్పటివరకు 56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది.8 లక్షల మందికి పైగా రైతుల నుంచి ఈ ధాన్యం సేకరించింది. రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి 9 వేల 703 కోట్ల రూపాయలను నేరుగా జమ చేసింది. 13 వేల 200 లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లతో ధాన్యాన్ని గిడ్డంగులు, మిల్లులకు తరలిస్తోంది.

**డెస్క్**

-----------------------------------

**రైతుల ధర్నా**

ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామంలో రైతులు ధర్నా నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి రోజులు గడుస్తున్న సంచులు, లారీలు లేవని కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోరుట్ల , వేములవాడ ప్రధాన రహదారిపై ఉదయం నుంచి ధర్నా చేయడంతో రోడ్డు కు ఇరువైపులా గంటల తరబడి ఎక్కడి వాహనాలు అక్కడే భారీగా నిలిచిపోయాయి.

**పీటీసీ సిరిసిల్ల**

------------------------------

**మైనారిటీ సంక్షేమ శాఖ కొత్త డైరెక్టర్**

ఐఏఎస్ అధికారి అబ్దుల్ హమీద్ ను మైనారిటీ సంక్షేమ శాఖ కొత్త డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇంతకాలం సిద్దిపేట అదనపు కలెక్టర్ గా పనిచేసిన అబ్దుల్ హమీద్.....నిన్న మైనారిటీ సంక్షేమ శాఖ కొత్త డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

**డెస్క్**

-----------------------------------

**గ్రీనింగ్ సమ్మిట్**

రాష్ట్రంలో హరిత పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేసేందుకు తెలంగాణ MSME గ్రీనింగ్ సమ్మిట్ RAMP కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖల పరిధిలోని రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ నిన్న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో ఈ సదస్సు జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు...

తెలంగాణ MSME గ్రీనింగ్ పోర్టల్, MSME అసెస్మెంట్ టూల్‌కిట్ లను ఆవిష్కరించారు. తెలంగాణలోని MSMEలలో సుస్థిర పారిశ్రామిక పరివర్తనను ప్రోత్సహించేందుకు, స్వచ్ఛమైన సాంకేతికతలను అవలంబించడానికి, వనరుల సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఈ

సదస్సు నిర్వహించారు. పారిశ్రామిక వృద్ధికి మద్దతు ఇవ్వడమే కాకుండా, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణను జాతీయస్థాయిలో నెంబర్ 1గా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్ బాబు తెలిపారు.

**డెస్క్**

----------------------------------

**కలెక్టర్ తనిఖీలు**

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్నను వెంటనే మిల్లులకు తరలించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను అదేశించారు. రఘునాథపల్లి మండలం వెల్ది, జాఫర్ గూడెం గ్రామాలలోని ఐకెపి సెంటర్లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు18 వేల 176 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేశారు. అదనపు గోదాములను ఏర్పాటు చేసి, త్వరితగతిన ధాన్యం, మొక్క జొన్న బస్తాల దిగుమతి అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు జనగామ కలెక్టర్ సూచించారు.

**పీటీసీ జనగామ**

------------------------------

**బాల్య వివాహాలు**

బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు, బాలికల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నల్గొండలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిషేధ చట్టం–2006పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యులు కావాలని, తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.

**పీటీసీ నల్గొండ**

---------------------------